ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

- 'సమస్యలపై శంఖారావానికి' శ్రీకారం..
- ప్రతినెల డివిజన్ల వారీగా కార్యక్రమాలు, పరిష్కారంపై సమీక్షలు..
- ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్

కమలాపురి కాలనీలో నిర్వహించిన 'సమస్యలపై శంఖారావం'లో ఎమ్మెల్యే గోపినాథ్

కాలనీ ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరిస్తూ.. సమస్యలు వింటున్న ఎమ్మెల్యే మాగంటి

జూబ్లీహిల్స్, జూన్ 18: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'సమస్యలపై శంఖారావం'.. కార్యక్రమాన్ని చేపడుతున్నామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అన్నారు. సమస్యలర హిత డివిజన్లుగా తీర్చిదిద్దేందుకు బస్తీలు, కాలనీల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ అధ్యక్షతన కమలాపురి కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయ ప్రాంగణంలో 'సమస్యలపై శంఖారావం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తొలి రోజు నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూసుఫ్‌గూడ, శ్రీనగర్ కాలనీ డివిజన్‌ల సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమస్యలపై శంఖారావం కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీతో పాటు ప్రభుత్వ శాఖలకు చెందిన అన్ని విభాగాల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, ప్రజలతో కలిసి పర్యటించి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. గతంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఈ కార్యక్రమాన్ని డివిజన్ల వారీగా నిర్వహించడంతో పాటు ప్రతినెల సమస్యల పరిష్కారంపై సమీక్షించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రాణి, సివిల్ సప్లై డీటీ సయ్యద్ అంజద్ అలీ, టీజీఎస్ ఎస్పీడీసీఎల్ అధికారులు సాంబశివరావు, నరేందర్, షేక్‌పేట్ ఎమ్మార్వో ప్రదీప్ రెడ్డి, 19 వ సర్కిల్ ఇంజినీరింగ్ డిప్యూటీ ఈఈలు శ్రీరాములు, రామచంద్రరాజు, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్యామ్, యూసీడీ డీపీఓ వెంకటకిషన్ రావు, జీహెచ్ఎంసీ ఎల్ఆర్‌కిల్ డిప్యూటీ ఈఈ మల్లికార్జున్, ఎంటమాలజీ ఏఈ సావిత్రి, శానిటేషన్ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, యూబీడీ సూపర్‌వైజర్ మహ్మద్ అలీ, కమలాపురి కాలనీ అధ్యక్షుడు గోకులే , తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువులో అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయాలి

చెరువులో మట్టి తవ్వకాలను నిలిపివేయాలి కోరుతూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న మదన్‌పల్లి గ్రామస్తులు

శంషాబాద్ రూరల్, జూన్ 18 : మండలంలోని మదన్‌పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని నల్లచెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలను నిలిపివేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు రెవెన్యూ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మదన్‌పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని నల్లచెరువులో కొందరు అక్రమార్కులు చెరువులో అక్రమంగా తవ్వకాలు జరిపి మట్టిని అమ్ముకుంటున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు చెరువు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. గ్రామాలకు చెరువులు ఎంతో కీలకమన్నారు. అలాంటి చెరువుల్లో మట్టిని తవ్వుకొని అమ్ముకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మదన్‌పల్లి కొత్త తండాకు చెందిన రవినాయక్, కమ్మరి వెంకటేశ్, శంకరయ్య, పలువురు ఉన్నారు.

బోనాల నిధులకు ..దరఖాస్తు చేసుకోవాలి

సికింద్రాబాద్,జూన్18: సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో అమ్మవారి దేవాలయాల నిర్వాహకులు బోనాలు నిధుల మంజూరుకు దరఖాస్తులు చేసుకోవాలని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సూచించారు. గత సంవత్సరం నిధులు పొందిన ఆలయాల నిర్వాహకుల దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తారని, ఆలయం లెటర్ హెడ్‌తోపాటు ఆల యం ఫొటో, ప్రెసిడెంట్/సెక్రటరీ ఆధార్ కార్డు జిరాక్స్, ఆలయం బ్యాంక్ అక్కౌంట్ వివరాలు, నిధుల వినియోగం వివరాలతో యుటిలైజేషన్ సర్టిఫికెట్ అందజేయాలని కోరారు.

యూసుఫ్‌గూడకు 50 వేల మొక్కలు..

జూబ్లీహిల్స్,జూన్ 18 : యూసుఫ్‌గూడ సర్కిల్‌లో పచ్చదనం పెంపునకు 50 వేల మొక్కలు కేటాయించినట్లు జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది హరితహారం కార్యక్రమం లేక పోవడంతో సర్కిల్‌కు మొక్కల కేటాయింపు గణనీయంగా తగ్గింది. కాగా గతంలో నాటిన మొక్కలపై దృష్టి పెట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక పార్కుల్లో నర్సరీలు సైతం అందుబాటులో లేక పోవడంతో యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కు నుంచి మొక్కలు అవసర మైన చోటుకు తరలించనున్నారు.

బోనాలకు ఏర్పాట్లు చేయండి

హిమాయత్‌నగర్, జూన్ 18: బోనాల పండుగ నేపథ్యంలో ఆలయాల పరిసర ప్రాంతాలు, రోడ్లు శుభ్రంగా ఉండేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహా లక్ష్మి కోరారు. ఈ మేరకు మంగళవారం చంద్రానగర్, ఓల్డ్ కమేలాబస్తీతో పాటు పలు ఆలయాలను ఆమె సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ..డివిజన్‌లోని ఆలయాలకు బోనాల సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కాంగ్రెస్ నాయకులు జి.రామన్‌గౌడ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

20న అల్బెండజోల్ మాత్రలు పంపిణీ..

నేషనల్ డీ వార్మింగ్ డే నిర్వహణపై శిక్షణ.. టాబ్లెట్లు వేసుకోని పిల్లలకు 27న ..

ఎన్‌డీడీ నిర్వహణపై వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ అనురాధ

జూబ్లీహిల్స్, జూన్ 18 : నులి పురుగుల నివారణకు 1-19 ఏండ్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ అనురాధ పేర్కొన్నారు. ఈనెల 20న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలని సూచించారు. మంగళవారం రహ్మత్‌నగర్ డివిజన్, శ్రీరాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌డీడీ కార్యక్రమ నిర్వహణపై ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు, ఆశలకు, ఇతర వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు ఒక్కరికి కూడా మినహాయింపు లేకుండా మందులు పంపిణీ చేయాలని తెలిపారు. నేషనల్ డీ వార్మింగ్ డే కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు, పిల్లలకు, విద్యార్థులకు ఈ టాబ్లెట్ పొడిని, మాత్రలను వేయాలని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న పిల్లలకు మందులు వేయకూడదని.. అదేరోజు పాఠశాలకు డుమ్మా కొట్టే విద్యార్థులకు ఎన్‌డీడీ మాప్ అప్ డే నిర్వహించి వారం రోజుల తరువాత అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. శ్రీరాంనగర్ క్లస్టర్‌లోని పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానల పరిధిలో ఈనెల 20 న నిర్వహించే ఎన్‌డీడీ కార్యక్రమంలో టాబ్లెట్స్ వేసుకోకుండా మిస్ అయిన పిల్లలకు జూన్ 27న అల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ అశ్రిత, డాక్టర్ సుభాన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు..

ఇంద్రానగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

జూబ్లీహిల్స్,జూన్18: సమస్యలు పరిష్కరించి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని ఇంద్రానగర్‌లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, వాటర్ సమస్యలను పరిశీలించి.. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వణిధర్, స్థానిక నాయకులు అనంతన్న, ముంతాజ్ పాల్గొన్నారు.

లష్కర్ జిల్లా ఏర్పాటుకు కృషి..

సికింద్రాబాద్,జూన్ 18: లష్కర్ జిల్లా ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు,బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ హామీ ఇచ్చారు.మంగళవారం లష్కర్ జిల్లా సాధన కమిటీ సభ్యులు కలిసి జిల్లా ఏర్పాటు విషయంలో బీజేపీ మద్దతు తెలపాలని కోరారు. పెరిగిన జనాభా దామాషా ప్రకారం జిల్లా ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఈ విషయంలో పార్టీలో చర్చించి తగు విధంగా నిర్ణయం తీసుకుంటామని డాక్టర్ లక్ష్మణ్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, బాలరాజ్ యాదవ్, బాబూరావు, సునీల్ ముదిరాజ్, జగదీష్ గౌడ్, కృష్ణ ముదిరాజ్, రవీందర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్‌పై దాడిచేసినవారిని శిక్షించాలి

శంషాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న ఫొటో గ్రాఫర్లు

శంషాబాద్ రూరల్, జూన్ 18 : ఫొటో గ్రాఫర్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం శంషాబాద్ ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాదాద్రి- భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం, పుట్టపాక గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ లింగంపై ఓఫంక్షన్‌లో సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీయలేదనే నెపంతో దాడిచేయగా అతడికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. తక్షణమే దాడిచేసిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. ఆందోళనలో లక్ష్మణ్ ముదిరాజ్, కృష్ణయాదవ్, శేఖర్‌గౌడ్, జగన్, ఈశ్వర్,నర్సింగ్‌రావు,రాజు, షరీఫ్, సాధిక్, అమీర్, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

నాలాల పూడికతీత పనులు ప్రారంభం

మ్యాన్‌హోళ్లను శుభ్రం చేస్తుండగా పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ,జూన్ 18: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలాల పూడికతీత పనులు చేపడుతున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని మంగళవారం తొలగించారు. కిస్మత్‌పూర్ పిరం చెరువు, జేఎన్ఎన్‌యూఆర్ఎం ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ శరత్‌చంద్ర మ్యాన్‌హోళ్లను పరిశీలించి మాట్లాడు తూ.. వర్షకాలం సమీపిస్తుండటంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో మాన్‌సూన్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. అత్యవసర సమయంలో తమకు సమాచారం అందిస్తే మాన్‌సూన్ సిబ్బంది అవసరమైన సేవలు అందిస్తారని తెలిపారు.

నాటక కళాకారులను ఆదుకోవాలి

నాటక కళారంగానికి విశేషంగా సేవలందించిన కళాకారులను ఆదుకోవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి అన్నారు. సర్వకళాకారుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం నాటక కళారంగానికి విశేషంగా కృషి చేసిన పలువురు నిపుణులకు ఆర్థిక సాయం పంపిణీ జరిగింది. రమణాచారి, సంఘసేవకుడు సారిపల్లి కొండలరావు, లంక లక్ష్మీనారాయణ, నృత్య గురువు భారతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంక్షేమ వేదిక అధ్యక్షుడు అశోక్ పవార్, కార్యదర్శి జి.కె. రవిచంద్ర పాల్గొని ఆర్థిక సహకారాన్ని అందించారు. అనంతరం నిర్వహించిన సంగీత విభావరి అలరించింది.

- తెలుగు యూనివర్సిటీ

విప్ బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

ఖైరతాబాద్, జూన్ 18 : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు రాష్ట్ర మంత్రి వర్గంలో పదవీ కేటాయించాలని బీసీ యువజన జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్ కురుమ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో కురుమల పాత్ర మరువలేనిదన్నారు. దొడ్డి కొమురయ్య నుంచి కొనపురి సాంబశివుడు, రాములు వరకు తెలంగాణ కోసం తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. ఇటీవల అలేరు అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో బీర్ల ఐలయ్యను 50వేల మెజార్టీతో గెలిపించారని, మంత్రి పదవీకి ఆయన అన్ని విధాలుగా అర్హుడని అన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం రాష్ట్ర నాయకులు దొడ్డి శ్రీనాథ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు శ్రీశైలం, ఉపాధ్యక్షులు బీర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కృష్ణ కురుమ, ఓయూ నేత మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు కేవీఆర్ కిట్ల పంపిణీ

తెలుగు యూనివర్సిటీ, జూన్ 18 : ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవరచుకొని సహాయాన్ని అందించి పేదలకు అండగా నిలవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి అన్నారు. నాంపల్లి రెడ్‌హిల్స్ సఫీజ్‌రెసిడెన్సీలోని రమణాచారి కార్యాలయంలో ఎల్‌పీడీఓ అధ్యక్షుడు భరత్ సంగం జన్మదినం సందర్భంగా అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగులకు నిత్యావసర సరుకులతో కూడిన కేవీఆర్ కిట్లను రమణాచారి దంపతులు పంపిణీ చేశారు. రమణాచారి మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, సెట్విన్ మాజీ ఎండీ వైద్యనాథ్, కన్నారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'గోదాంల' నిర్మాణాలకు నిధులు మంజూరు

ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు కృతజ్ఞతలు

శంషాబాద్ రూరల్, జూన్ 18 : మల్కారం సహకార సంఘం బ్యాంకు వద్ద మరో రెండు గోదాముల నిర్మాణానికి రూ.2కోట్లకు పైగా నిధులను ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ సహకారంతో నాబార్డ్ ద్వారా మంజూరు అయ్యాయని మల్కారం సహకార సంఘం చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్ మండలంలోని మల్కారం సహకార సంఘం బ్యాంకు వద్ద మరోరెండు గోదాంల నిర్మాణం కోసం ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతీసుకొని 2కోట్ల 25లక్షల రూపాయలు మంజూరు చేయించారని వివరించారు. త్వరలో గోదాం నిర్మాణం పనులకు భూమిపూజ చేస్తామని తెలిపారు.


నిధులు మంజూరు పత్రాలను పాలకవర్గానికి అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

ఇప్పటికే మల్కారం సహకార సంఘం బ్యాంకు ఆధ్వర్యంలో రెండు గోదాములను నిర్మాణం చేయడంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. మరో రెండు గోదాంల నిర్మాణంతో మరింత మేలు జరుగుతుందని వివరించారు. రైతులను ఆదుకోవడం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులకు రుణాలు ఇవ్వడంతోపాటు వారికి విత్తనాలు ఎరువులు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు పండించిన వరి, మక్క జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపా రు. ఎమ్మెల్యేను కలిసినవారిలో సహకార సంఘం వైస్ చైర్మన్ ప్రభుసాగర్, డైరెక్టర్ కాసుల బాల్‌రాజ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప్పుగూడ వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీలో భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్) జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన టోర్నీ ఫైనల్లో సాయ్ టీమ్ 41-35 తేడాతో నవ శక్తి క్రీడామండల్‌పై విజయం సాధించింది. విజేత, రన్నరప్ జట్లకు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్ ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సతీశ్‌కుమార్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి స్టేడియం వేదికగా ఐటీఓఫ్ జాతీయ పారా టోర్నీ మంగళవారం ఘనంగా ముగిసింది. బాలికల సబ్‌జూనియర్ అక్వాథ్లాన్ విభాగంలో తెలంగాణకు చెందిన జోహాన్న షిజు రజత పతకంతో మెరిసింది. మిగతా విభాగాల్లో దుర్విశ పవార్, సోరమ్, నెల్షి, తోకోచామ్ గౌతమ్, అథర్వ్ షాజి పాటిల్, స్నేహల్ జోషి, రోషన్ గోండ్ పసిడి పతకాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రయథ్లాన్ అధ్యక్షుడు మదన్‌మోహన్, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.- హైదరాబాద్, ఆట ప్రతినిధి

గృహిణి అదృశ్యం..

కాచిగూడ, జూన్ 18: గృహిణి అదృశ్యమైన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్సై హెచ్. నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చెప్పల్‌బజార్‌కు చెందిన శ్యామ్‌సింగ్ భార్య నిఖితాసింగ్ ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. దాంతో భర్త శ్యామ్ సింగ్ కాచిగూడ పీఎస్‌లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. వెళ్లే సమయంలో ఆమె ఆకుపచ్చ పైజామా, నీలి రంగు చున్నీ ధరించి, ఎత్తు 6 అడుగులు ఉన్నట్లు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేగంగా స్కూల్ వ్యాన్..

రెండు షాపులు ధ్వంసం

కాచిగూడ, జూన్ 18 : వేగంగా వచ్చిన స్కూల్ వ్యాన్ షాపుల్లోకి చొచ్చుకు వెళ్లడంతో రెండు షాపులు ధ్వంసమైన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పి.లక్ష్మీకాంత్‌రెడ్డి, అడ్మిన్ ఎస్సై డి. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌కు చెందిన జానయ్య మంగళవారం ఉదయం 8:30 గంటలకు వివిధ స్కూళ్ల విద్యార్థులను చేరవేయడానికి తిలక్‌నగర్ నుంచి కోరంటి వైపు వస్తున్నాడు. వ్యాన్ తిలక్‌నగర్ మహేశ్ పాన్‌షాప్ పక్కన ఉన్న వెల్డింగ్, టీ షాపులోకి దూసుకెళ్లింది. దీంతో రెండు షాపులు ధ్వంసమైనట్లు పోలీసులు తెలిపారు. వ్యాన్‌తో పాటు, షాపులలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. బాధితుల ఫిర్యాదు మేరకు జానయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాచిగూడ,జూన్ 18: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా, ఘన్‌పూర్ మండలం, సోలిపూర్ గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి కుమారుడు కె.రాజవర్ధన్‌రెడ్డి(47)ఈనెల 14న పురుగుల మందు తాగి మలక్‌పేట రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం దిమ్మెపై ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు రాజవర్ధన్‌రెడ్డిని చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.